క్రీడలతో ఉన్నత కీర్తి ప్రతిష్టలు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు దోహదం



ఫుట్‌బాల్ సర్వీస్ చేసి ఆట ప్రారంభించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: 'విద్యతో మంచి ఉద్యోగాలు రావడం, వాటి ద్వారా జీతాలు రావడం సహజం. అయితే క్రీడల్లో ఆరితేరి రాణిస్తే ఉన్నతమైన భవిష్యత్, పుట్టిన ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి కీర్తి, ప్రతిష్టలు లభిస్తాయి' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై అవగాహన సమావేశం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి వెలుగులోకి తెచ్చేందుకు వారికి మంచి అవకాశాలు కల్పించేందుకు వీలవుతుందన్నారు. ఇది గుర్తెరిగి ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని తమ సత్తా చాటాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో, క్రీడలకు అంతకు రెట్టింపు ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. క్రీడలతో మంచి ఆరోగ్యం, మానసిక పరిపక్వత కలుగుతుందన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అందరి అధికారులు, నాయకులు, విద్యార్థులు సమష్టిగా కృషి చేస్తేనే విజయవంతం అవుతుందన్నారు. ఇప్పటికే ఆత్మకూరు నియోజకవర్గం పరిధిలో 24 వేల మందికిపైగా తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ తదితర ఐదు ఆటలతో ఈ ఆడుదాం ఆంధ్రా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రైజ్ మనీ సైతం ఆకర్షణీయంగా లక్షలాది రూపాయలు ప్రభుత్వం ప్రకటించినట్లు ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇలా కోట్లాది రూపాయల ఖర్చుతో క్రీడా పోటీలు నిర్వహించడం జరగలేదన్నారు. అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలో సముద్రతీరం అధికంగా ఉండడంతో (169 కి.మీ.) 8 పోర్టులు, 14 ఫిషింగ్ హార్బర్లు సిద్ధం అవుతున్నాయని ఇది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. సచివాలయ, వలంటీరు వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకే అందేలా చేస్తున్న ఈ వ్యవస్థపై ఇతర రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయంటే జగనన్న విజన్ అర్థమవుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు పీకేలపై ఆధారపడుతున్నారని, జగనన్న మాత్రం ప్రజలపై నమ్మకంతోనే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్నారని ఎమ్మెల్యే చెప్పారు. సంక్షేమ పథకాలు ఇంటికే చేరాలంటే జగనన్నే మరోసారి ముఖ్యమంత్రి కావాలన్న విషయం మరవద్దని సూచించారు. అనంతరం క్రికెట్, వాలీబాల్ క్రీడలను లాంఛనంగా ఆడి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధులత మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, రఘునాథరెడ్డి, గంగా శ్రీనివాసులు నాయుడు, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, ఐవీ రమణారెడ్డి, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, క్రీడా అధ్యాపకులు తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ వేస్తున్న మేకపాటి రాజారెడ్డి

పండగ వాతావరణంలో పోటీలు

- సమన్వయకర్త మేకపాటి

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు అట్టహాసంగా సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నియోజకవర్గంలో పండగ వాతావరణంలో నిర్వహించుకోవాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని కుర్రపల్లె బీసీ కాలనీలోని క్రీడా మైదానాన్ని పరిశీలించి క్రీడాకారులు, గ్రామస్తులతో కొద్దిసేపు క్రీడలు ఆడి వారని ఉత్తేజపరిచారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ కార్యక్రమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్నారన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం, మానసికోల్లాసం పెంపొందించుకోవచ్చన్నారు. క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని తమ క్రీడా ప్రతిభను కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ గాజుల తాజుద్దీన్, జేసీఎస్ కన్వీనర్ కె.కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు కె.శ్యామలాదేవి, కె.వెంకటేశ్వరరెడ్డి, మాజీ కన్వీనర్లు ఏ భాస్కరరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, నాయకులు అక్కుల్‌రెడ్డి, ఎం.లక్ష్మయ్య, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: మండలంలోని ఏపిలగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత రసం రామకృష్ణారెడ్డి తల్లి రసం ఓబులమ్మ అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. రసం ఓబులమ్మ పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులనాయుడు, బూత్ మేనేజర్ రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, కాశీరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

హనుమద్ వ్రత పూజలు



అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ గ్రామ పురవీధుల్లో వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి దగ్గ పవన్‌కుమార్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు



మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నమైన ఏసుక్రీస్తు బోధనలు ప్రజలకు శాంతిని చేకూరుస్తాయని ఇలాంటి బోధనలు చేసిన క్రీస్తు పుట్టిన రోజు క్రిస్మస్‌ను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం కోరారు. సోమవారం క్రిస్మస్ పండగను సోదరులు సంతోషంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాధికారతకు కేంద్ర ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న కంది మల్లికార్జునరెడ్డి

ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ఆర్థిక సాధికారత లభిస్తుందని ఆత్మకూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జున రెడ్డి అన్నారు. మండలంలోని మురగళ్లలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సర్పంచ్ పువ్వాడి హరిత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ శ్రీనివాసులు, వైద్యాధికారి డాక్టర్ అనూషాకుమారి, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను తెలియజెప్పారు. కార్యక్రమంలో మండల బీజేపీ కన్వీనర్ వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు రామసుబ్బయ్య, వెంకటరమణ, సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సేవా సంఘం దాతృత్వం



శ్రీనివాస ఆచారి కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

కావలి: పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్‌లో నివసిస్తున్న మారెళ్ల శ్రీనివాస ఆచారి ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. ఆయనకు చేతికి బలమైన గాయం కావడంతో ఆస్పత్రిలో మెరుగైన వైద్యం చేయించుకున్నారు. సమాచారం తెలుసుకున్న కావలి పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పుత్తూరు సుధాఆచారి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పాల్గొని శ్రీనివాస ఆచారికి రూ.18,000 ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. శ్రీనివాస ఆచారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకున్న రైతులు



పంట కాలువపై ఆక్రమించిన నిర్మాణాలను రైతులు తొలగించిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలో పంట కాలువను ఆక్రమించి నిర్మాణ పనులు చేస్తుండగా రైతులు అడ్డుకున్నారు. రెండు రోజులుగా ఇళ్ల మధ్యలో ప్రవహిస్తున్న పంట కాలువ పక్కనే మట్టి దిబ్బ ఉంది. దానిని స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఆక్రమించి చదును చేసి ఆదివారం పిల్లర్ల నిర్మాణం చేపట్టాడు. దీంతో సమాచారం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని పిల్లర్ కమ్ములను పడదోశారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యక్తికి ఇప్పటికే పట్టణంలో రెండు చోట్ల ఖరీదైన వ్యాపార గది, స్థలం ఉన్నాయని పలువురు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 10 స్థానాలు మావే

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి అనిల్‌కుమార్‌యాదవ్



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో సిటీ ఎమ్మెల్యే అనిల్

కావలి: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలుపొందుతారని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆయన్ను కలిసిన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో అందరం కలిసి కట్టుగా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు కలిసి ఎమ్మెల్యే కాసేపు వివిధ అంశాలపై చర్చించారు. మాజీ మంత్రి వెంట ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ కూడా ఉన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



18 మెట్ల పూజలను చేస్తున్న అయ్యప్పస్వాములు

జలదంకి: జలదంకి జానకీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి పడి పూజోత్సవం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది అయ్యప్ప మాలధారులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. 18 మెట్లను ఏర్పాటు చేసి పడిపూజ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. క్షీరాభిషేకం, పెరుగు, కొబ్బరి, నెయ్యి, తేనె, చెరకురసం, పచ్చ కర్పూరం, పన్నీరు, గంధాభిషేకం, కలశ, పంచామృతాలతో అభిషేకాలను చేశారు. అయ్యప్ప నామస్మరణతో భక్తులు పరవశించిపోయారు. పడి పూజ, అన్నదానానికి పులిమి నారాయణరెడ్డి మనుమడు హరినారప రెడ్డి, చేవూరు జనార్దన్‌రెడ్డి, దండా పవన్‌కుమార్ రెడ్డి, పులుగుంట మధురెడ్డి, రామాల రమేష్‌రెడి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జనవరి 10 నుంచి డాక్టర్ జీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలో సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి 10వ తేదీ నుంచి సోమశిల ప్రాజెక్ట్ యూత్, హెల్పింగ్ హార్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్నట్లు కార్య నిర్వాహకులు జె.నారాయణ, యు.నాగరాజు, షేక్ మహమ్మద్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించి యువతలో క్రీడలపై ఆసక్తి పెంచాలని దృఢసంకల్పంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతసాగరం, మర్రిపాడు, ఆత్మకూరు, సంగం, ఏఎస్‌పేట, కలువాయి మండలాలకు చెందిన క్రీడాకారులు జనవరి 5వ తేదీలోపు తమ జట్టు పేర్లను తెలపాలన్నారు. వివరాల కోసం 9705301421, 9493236520 నంబర్లకు వివరాలు తెలపాలని వివరించారు.

హిందూ సమ్మేళనం



శోభాయాత్ర చేస్తున్న భక్తులు

కలిగిరి: స్థానిక షిరిడీ సాయిరాం డిగ్రీ కళాశాల ఆవరణలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విరజానందస్వామి ఆధ్వర్యంలో శోభాయాత్ర, నగర సంకీర్తన కార్యక్రమాలు చేపట్టారు. హిందూ మత సంప్రదాయాలు, సంస్కృతిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు కదిరి రంగారావు, కర్రా భాస్కర్, అంజమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధం ఊరేగింపు



గంధాన్ని పంచుతున్న దృశ్యం

చేజర్ల: చేజర్లలోని హజరత్ ఖాదర్‌వల్లి దర్గాలో ఆదివారం గంధ మహోత్సవాన్ని నిర్వహించారు. ఒంటిపై గంధాన్ని ఊరేగించారు. అనంతరం దర్గాలో ఉంచి పూజలు చేసి భక్తులకు గంధాన్ని పంచారు. ఈకార్యక్రమంలో దర్గా కమిటీ గౌరవాధ్యక్షుడు షేక్ మస్తాన్‌సాహెబ్, సభ్యులు షేక్ నజీర్, హసన్ అహ్మద్, షేక్ దావూద్, షేక్ ఇస్మాయిల్, షేక్ రజాక్, మునీర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



ఆలయ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాత శ్రీను

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి తోటలచెరువుపల్లికి చెందిన ముల్లంగి శ్రీను ఆదివారం రూ.50,116 నగదు విరాళంగా అందించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం త్వరితగతన పూర్తి చేసుకోవాలన్నారు. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తోటలచెరువుపల్లె సర్పంచ్ పేర్నంపాటి పెదమాలాలి, జానీ, రవికుమార్, నిర్వాహకులు బాలయ్య, బాలకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా సీఎం జగన్

- కార్పొరేషన్ చైర్మన్ కొర్నా



క్యాలెండర్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

ఇందుకూరుపేట: రాష్ట్రంలోని ముదిరాజ్‌లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని, వారికి ప్రత్యేక స్థానం కల్పించారని ఆ కార్పొరేషన్ చైర్మన్ కొర్నా నారాయణరావు అన్నారు. గంగపట్నం శ్రీచాముండేశ్వరి దేవి అమ్మవారి ఆలయ ఆవరణలో ఉన్న కల్యాణ మండపంలో ఆదివారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ఈ క్యాలెండర్లను ముద్రించి భక్తులకు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్ సింగ్, బీజేపీ నాయకులు సుబ్బారాయుడు, ఎం.సురేష్, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, గంపల సుబ్రహ్మణ్యం, గంపల వెంకటకృష్ణయ్య, సంగం వెంకటేశ్వర్లు, గుడి రామకృష్ణ, ముదిరాజ్ మహాసభ నాయకులు పాల్గొన్నారు.

సాగు నీటి కోసం నిరసన

చేజర్ల: సోమశిల ప్రాజెక్ట్ దక్షిణ కాలువ ద్వారా తమ పొలాలకు సాగునీరు ఇవ్వాలని మండలంలోని నాగులవెలటూరు రైతులు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పొదలకూరు–కలువాయి మార్గంలో నాగులవెలటూరు వద్ద రోడ్డుపై నిరసన చేపట్టారు. వరి సాగుకు నీరిచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. గత వారం రోజుల క్రితం అధికారులకు సైతం తమ సమస్యను విన్నవించినట్లు తెలిపారు. నిరసన చేపట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రభాకర్ రైతులతో మాట్లాడి నిరసన విరమింప చేశారు.

వైభవంగా హనుమత్ శోభాయాత్ర



ఆత్మకూరులో హనుమత్ శోభాయాత్ర చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: గత 40 రోజులుగా హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు ఆ మొక్కులు తీర్చుకునేందుకు పవనముడి (ఇరుముడి) ధారణతో పట్టణంలో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో మహిళలు ముందు వైపు అఖండ జ్యోతులు చేతబట్టి యాత్రలో సాగారు. పంటవీధిలోని రామాలయంలో దీక్షలు పూర్తయిన స్వాములు పవనముడి కట్టుకుని అది తలపై ధరించి హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ భక్తులతో కలిసి శోభాయాత్రలో సాగారు. పట్టణంలోని ప్రధాన వీధులు మీదుగా సాగిన ఈ శోభాయాత్ర బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరుకుంది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవనముడులు స్వామి వారికి సమర్పించారు. అనంతరం సుందరకాండ, హనుమాన్‌చాలీసా పారాయణంతో అర్చకులు నాగరాజశర్మ, రామయ్య స్వామి, ఆనంద స్వామి హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. యజ్ఞ ప్రసాదం అందరికి పంచి పెట్టారు.

గిరిజన కుటుంబాలకు రెడ్‌క్రాస్ రిలీఫ్ కిట్ల పంపిణీ



రిలీఫ్ కిట్లను అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కావలి: మిచాంగ్ తుఫాన్ బాధితులైన 45 గిరిజన కుటుంబాలకు ఆదివారం రెడ్‌క్రాస్ సంస్థ రిలీఫ్ కిట్లను పంపిణీ చేసింది. పట్టణంలోని చెరువుగట్టు సంఘం గిరిజన కాలనీలో కుటుంబాలకు టార్పాలిన్ పట్టలు, సబ్బులు, షాంపులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులతో కూడిన హైజీన్ కిట్‌ను అందజేశారు. రెడ్‌క్రాస్ రిలీఫ్ టీమ్ ఇన్‌చార్జి హరినారప రెడ్డి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా గుడిసెలు ముంపునకు గురి కావడంతో ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్నారన్నారు. ప్రస్తుతం నీరు తగ్గి, చెమ్మ ఆరడంతో తిరిగి గుడిసెలకు వచ్చారన్నారు. వారికి తక్షణ సహాయంగా రెడ్‌క్రాస్ జిల్లా శాఖ సమకూర్చిన రిలీఫ్ కిట్లను అందజేశామన్నారు. వీరికి మరింత సహాయం అందెందుకు ప్రయత్నిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వలంటీర్లు అనీల్, ప్రమోద్, టీమ్ సేవియర్స్ భార్గవ్, సుశాల్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలకు క్రిస్మస్ కేక్‌ల పంపిణీ



చర్చిలకు కేక్‌లు పంపిణీ చేస్తున్న అలీఅహ్మద్



కలిగిరిలో కేక్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మాల్యాద్రిరెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి

వరికుంటపాడు/కలిగిరి: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వరికుంటపాడు మండలంలోని అన్ని చర్చిలకు క్రిస్మస్ కేక్‌లను ఆదివారం అందజేశారు. క్రైస్తవులు క్రిస్మస్ పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. వారికి ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కలిగిరిలో చర్చి ఫాదర్లకు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ ఆలీఅహ్మద్, సర్పంచ్ ఎర్రమల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దాసరి ఎర్రా ఓబయ్య, నాయకులు మందలపు తిరుపతినాయుడు, నారాయణరాజు, తాతపూడి మోహన్, జయపాల్, పాలూరు కొండారెడ్డి, ఆవుల ప్రభాకర్‌రెడ్డి, కునిపోగు ఇర్మియ, పుల్లా రవి, కందుల రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



విద్యుత్ దీపాల అలంకరణతో శోభిల్లుతున్న ఉదయగిరి రోడ్డులోని చర్చి

కావలి: క్రిస్మస్ వేడుకలకు పట్టణంలోని అన్ని చర్చిలు ముస్తాబయ్యాయి. రంగుల విద్యుద్దీపాల అలంకరణతో చర్చిలు కనువిందుగా ఉన్నాయి. చర్చిలో రంగురంగుల పుష్పాలు, ఇతర అలంకరణలతో చర్చిల ప్రాంగణాలు శోభాయమానంగా అలరిస్తున్నాయి.

వరికుంటపాడు: క్రైస్తవుల పవిత్ర పర్వదినమైన క్రిస్మస్‌ను సోమవారం జరుపుకునేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు ప్రార్థనా మందిరాల (చర్చి)ను ఆదివారం ముస్తాబు చేసుకున్నారు. చర్చిలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. చర్చిల వద్ద స్టార్స్ ఏర్పాటు చేసుకున్నారు.